క్లుప్తంగా

మెనూ సక్రమంగా అమలు చేయాలి



నిర్మాణంలోని భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో మూర్తి ఆదేశించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేయాలని హెచ్‌ఎం రామును ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నోట్ పుస్తకాలను తనిఖీ చేసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న అప్పారావు, నాయుడు

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో బోటు బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన చల్లా వెంకట జోగారావుకు వైఎస్సార్ బీమా పథకం సొమ్ము మంజూరైంది. ఈ మేరకు తక్షణ సాయంగా రూ. 10 వేలు మృతుడి భార్య పైడిరాజుకు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఉగ్రూకుల అప్పారావు, చల్లా నాయుడు అందజేశారు. మిగిలిన సొమ్ము నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరినాట్లకు మేలు చేస్తున్న వర్షాలు



కె.జె.పురంలో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్: వాతావరణంలో ఏర్పడిన మార్పులతో గత సోమవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాల వల్ల వరి పంటకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట భూముల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. కొన్ని చోట్ల గతంలో వేసిన వరినాట్లకు సేంద్రియ ఎరువులు వేస్తున్నారు. పెద్దేరు, తారకరామ, జలాశయాల పరిధి ఆయకట్టులో వరినాట్లు ఊపందుకున్నాయి.

ఇంటికే వెళ్లి వైద్య సేవలు



రాములమ్మకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారి మోహినీ సురేఖ

రావికమతం: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా సోమవారం కొత్తకోట సచివాలయం -2 పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మోహినీ సురేఖ ముందుగా అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. మంచానికే పరిమితమైన రోగి కోట రాములమ్మ(80)కు ప్రత్యేక వైద్యమందించారు. బీపీ ఇతర పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందించారు. అనంతరం వైద్య శిబిరంలో 50 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది రామారావు, సౌజన్య, వరలక్ష్మి, ఆశ వర్కరు రామలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

రాంబిల్లి : వాడ నర్సాపురం గ్రామంలో సోమవారం ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గగన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టిక్కర్లతో ధర్మ ప్రచారం, భజనలు నిర్వహించారు.

బోగస్ ఓట్లు లేకుండా చూద్దాం..
నిజాయితీగా గెలుద్దాం..



రావికమతం: బీఎల్‌ఏలతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

- బీఎల్‌ఏల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: ఓటరు జాబితాలపై దృష్టి పెడదాం, బోగస్ ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగిద్దాం, ఎప్పటిలా నిజాయితీగా వచ్చే ఎన్నికల్లో గెలుద్దామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. మండలంలోని బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయనతోపాటు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాలను ప్రక్షాళన చేస్తోందన్నారు. మనమందరమూ వాటిపై దృష్టి సారిద్దామన్నారు. ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందడంతో అంతా పార్టీపై అభిమానంతో ఉన్నారన్నారు. ఎప్పటిలా ఓటరును కలిసి నిజాయితీగా ఓట్లు వేయించుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, ఎంపీపీ పైల రాజు, మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, సచివాలయ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక పాల కేంద్రం రైతుల సమావేశ హాలులో కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకటరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీల మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారన్నారు. కరోనా వచ్చి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలిగిందన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీరు వ్యవస్థ, సచివాలయ కన్వీనర్లను ఇంటింటికీ పంపి ఇంకా అర్హులెవరైనా మిగిలిపోతే జల్లెడ పట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. చోడవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు సంక్షేమ కార్యక్రమాలకు రూ, 1,850 కోట్లు, బుచ్చెయ్యపేట మండలంలో రూ.450 కోట్లు ఖర్చు చేశామన్నారు. కేబీ రోడ్డును రూ.32 కోట్లుతో విస్తరించగా, రూ.120 కోట్లతో బీఎన్ రోడ్డు పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయిస్తానన్నారు. రాజాం, తట్టబంద రోడ్డును రూ.4.50 కోట్లతో, మంశాపురం రోడ్డును రూ.56 లక్షలతో ఏర్పాటు చేయగా, పెదమదీన, గున్నెంపూడి, అయితంపూడి, రాజుపాలెం తదితర గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కొమళ్లపూడి వద్ద ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు 48 ఎకరాలు కేటాయించగా, అదే ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం తీసుకువస్తున్నామన్నారు. ఇన్ని అభివృద్ధి పనులు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గద్దె నెక్కేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలన్నారు. మరో ఎనిమిది నెలల్లో ఎన్నికలు రాబోతున్న దృష్ట్యా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ముచ్చకర్ల అప్పారావు, పెదిరెడ్ల మాణిక్యం, కోరుకొండ సూరి అప్పారావు, గొలజాన శ్రీను, గట్ల అప్పలనాయుడు, వేపాడ మధు, అమ్మునాయుడు, రాజునాయుడు, బర్ల శివ, బాబ్జీ పాల్గొన్నారు.

2 గ్రామాల్లో గృహ సారథుల బీమా నమోదు



ఎం. అలమండలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ రమణ

దేవరాపల్లి: ఎం. అలమండలో స్థానిక సర్పంచ్ దాడి జగన్, కొత్తపెంటలో సర్పంచ్ రొంగలి వెంకటరావు అధ్యక్షతన గ్రామ సచివాలయ గృహ సారథుల బీమా నమోదు శిబిరాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా గృహ సారథుల బీమా నమోదుపై సచివాలయ కన్వీనర్లకు జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ అవగాహన కల్పించారు. జేసీఎస్ సైన్యం యాప్ ద్వారా కన్వీనర్లకు శిక్షణ ఇచ్చి దగ్గరుండి గృహ సారథులకు బీమా నమోదు ప్రక్రియను చేయించారు. ఈ నెల 15లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. మంగళవారం నాగయ్యపేట, కాశీపురం గ్రామాల్లో బీమా నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఎం. అలమండ ఎంపీటీసీ పోతల వెంకటరావు, పొలిపిరెడ్డి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆందోళన



కొమిర సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

రావికమతం: ఉరలోవ కొండను ఆనుకున్న రెవెన్యూను వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో సాగుదారుల వివరాలను నమోదు చేయాలని కొమిర, కవగుంట, బుడ్డబంద గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం కొమిర సచివాలయం వద్ద ఆందోళన చేశారు. ఉరలోవ కొండ రెవెన్యూలో 370 ఎకరాలకు 412 మందికి 2013లో పట్టాలిచ్చారని, ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని వాపోయారు. ప్రభుత్వం చేస్తున్న రీసర్వేలోనైనా సెటిల్‌మెంట్ రికార్డులు తయారు చేసి తమ పేర్లు నమోదు చేయాలని గిరిజన సంఘం రైతులు సాలెం రాజిబాబు, బూరిగ రత్నం, ఎస్.లక్ష్మి తదితరులు కోరారు.

సామాజిక భవనానికి నిధుల మంజూరు



సామాజిక భవనం నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా తన పార్లమెంట్ పరిధిలో అంబేడ్కర్ పేరిట సామాజిక భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిధుల విడుదల పత్రాలను కశింకోట గ్రామ సర్పంచ్ జయరజనికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతలో కశింకోటలో సామాజిక భవన నిర్మాణానికి స్థానికులు వినతి పత్రం అందించారని, ఆ మేరకు ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కశింకోట నాయకులు ఎం.అప్పలనాయుడు, బి.సత్యారావు, ఎస్.సత్యనారాయణ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 30 మంది రోగులు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యుడు

అనకాపల్లిటౌన్: ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో భాగంగా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించడమే కాకుండా కంటిచూపు మందగించదని విశాఖ శంకర్ ఫౌండేషన్ క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం. అరుణ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎస్‌ఆర్‌పేటలో శంకర్ ఫౌండేషన్, శ్రీ సీతారామ మహిళా సేవాసంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా 30ని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరి ఆపరేషన్‌కు కావలసిన అన్ని రకాలైన పరీక్షలు చేసి, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామ సేవా సంఘం వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ, సభ్యులు కశిరెడ్డి శ్రీనివాసరావు, సుశీల, బల్లిన నాగమణి, నూకరత్నం, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి సాయం చేస్తున్న మిత్రులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి స్నేహితులు, దాతలు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించి, ఆసరాగా నిలిచారు. తాళ్లపాలేనికి చెందిన కర్రి నూకరాజు సమీపంలోని ఓ సిమెంట్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తూ, ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. దీంతో అతని టెన్త్ బ్యాచ్ స్నేహితులు కుటుంబానికి అండగా నిలవాలని భావించి రూ.35 వేలు సమకూర్చారు. స్థానిక బీజేపీ నాయకుడు గళ్లా రాజు రూ.10 వేలు, సిమెంట్ పరిశ్రమ లేబర్ కాంట్రాక్టర్ రూ.25 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని నూకరాజు కుటుంబానికి సోమవారం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో టెన్త్ బ్యాచ్ స్నేహితులు కర్రి లోవరాజు, గుమ్మడి శ్రీను, అనిల్, చిన్ని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎం. కోడూరు శివాలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్గిన అప్పారావు, అర్జునమ్మ, శ్రీరామమూర్తి విజయలక్ష్మి, వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్వామివారికి ప్రసాద నివేదన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సి.హెచ్.వి.ఎస్. మూర్తి తెలిపారు. కె.జె.పురం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు గ్రామానికి చెందిన పోలిమేర త్రినాథ్, పార్వతమ్మ, వారి కుమారుడు వెంకటరావు, భారతి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో చద్ది ఏర్పాటు చేసినట్టు గౌరీ పరమేశ్వర భజన సేవ కమిటీ తెలిపింది.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



మట్టి వినాయకులను ప్రదర్శిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక చవితికి వారివారి గృహాల్లో, వీధుల్లో మట్టి గణపతిని పూజించాలని పిలుపునిచ్చారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనోత్సవాల్లో నది, కాలువల్లో దిగే సందర్భాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సామూహిక నిమజ్జనోత్సవ కమిటి చైర్మన్ ఆడారి కుమారస్వామి, కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, తాటికొండ శ్రీకాంత్, కాంద్రేగుల సర్వేశ్వరరావు, పోలారపు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో 139 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: వర్షాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా సోమవారం వి.సంతపాలెంలో 139 మంది రోగులను ఆమె పరీక్షించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒమ్మలిలో

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా ఒమ్మలిలో సోమవారం వైద్య సేవలు అందించారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 80 మందిని రోగులను వైద్యాధికారి కె. నాగదివ్య పరీక్షించారు. ప్రధానంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను ప్రత్యేకంగా పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను, ఎంపీపీ, హైస్కూలులో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి శ్రీనివాస్, ఏఎన్‌ఎం గంగాభవానీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు వేయించాలి

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి



కె.సంతపాలెంలో రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి

కె.కోటపాడు: పశువులు ఈనిన రెండు నెలల సమయానికి ఎదకు రానున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. ఎదకు వచ్చే సమయంలో ఆయా పశువుకు కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు వేయించడం ద్వారా చూడికట్టే శాతం ఉంటుందని తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా కె.సంతపాలెంలో సోమవారం పాడి రైతులకు పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఆడపెయ్యల ఉత్పత్తి పథకంలో పశువులకు రెండు డోసుల వీర్యానికి రూ.500 చెల్లించాలని తెలిపారు. ఆడపెయ్యి జన్మించని పక్షంలో రైతులు చెల్లించిన నగదు వాపసు చేస్తామన్నారు. పాడి పశువులకు పచ్చగడ్డిని ఆహారంగా అందించాలని సూచించారు. పచ్చగడ్డిలో విటమిన్ -ఏ ఉండటం వల్ల ఆరోగ్యంతోపాటు చూడికట్టే పరిస్థితి మెరుగ్గా ఉంటుందని వివరించారు. సమావేశంలో పశువైద్య సహాయకుడు త్రినాథ్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ఆర్డీవో జయరాంకు సమస్య వివరిస్తున్న జోగంపేట భూనిర్వాసితులు

నర్సీపట్నం: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం కింద స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆర్డీవో వినతులు స్వీకరించారు. తాండవ నిర్వాసితులమైన తమకు కోటవురట్ల మండలం పందూరు గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను రద్దు చేశారని, వాటిని అప్పగించాలని జోగంపేటకు చెందిన దళితులు వినతిపత్రం అందజేశారు. తాను విచారణ చేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఆర్డీవో తెలిపారు. భూ సమస్యలు, రేషన్‌కార్డులు, సదరం సర్టిఫికెట్లు వివిధ రకాల సమస్యలు స్పందనలో 16 అర్జీలు వచ్చాయి. స్పందన ఫిర్యాదుల పట్ల జాప్యం చేయకుండా వెనువెంటనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు.

శ్మశాన వాటిక వాచ్‌మన్‌కు సొంత జీతం

ప్రతి నెలా రూ.2 వేలు అందిస్తున్న అమ్మతల్లినాయుడు



వాచ్‌మన్‌కు జీతం ఇస్తున్న అమ్మతల్లినాయుడు

మాడుగుల రూరల్: కె.జె.పురం కైలాసవాటిక వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కోన కృష్ణకు విజన్ -2020 సహకారంతో స్థానిక సంతోషిమాత ఆలయ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు సొంతంగా జీతం అందిస్తున్నాడు. 2020 నుంచి నెలకు రూ.2 వేల చొప్పున జీతం అందిస్తున్నాడు. ఇక్కడ కై లాసవాటికలో మొక్కలకు నీరు పోయడం, పిచ్చిమొక్కల తొలగింపు, వాటర్ ట్యాంకు నిర్వహణ, తదితర పనులను కృష్ణ చేస్తున్నాడు. కార్యక్రమంలో దాడి రాము, కాళ్ల అచ్చిమినాయుడు, పోలమరశెట్టి రామునాయుడు, సూరిశెట్టి అచ్చిమినాయుడు పాల్గొన్నారు.

టీడీపీ బంద్ విఫలం

- యధావిధిగా వాహనాల రాకపోకలు
- తెరుచుకున్న దుకాణాలు, స్కూళ్లు, కార్యాలయాలు



కె.కోటపాడులో ఉదయం సమయంలో తిరుగుతున్న బస్సులు, సాగుతున్న వ్యాపారాలు



చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ప్రయాణికులు

నర్సీపట్నం/చోడవరం/గొలుగొండ/రావికమతం/దేవరాపల్లి/మాడుగుల/కె.కోటపాడు/చీడికాడ/రోలుగుంట/బుచ్చెయ్యపేట: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ సీఎం చంద్రబాబు రిమాండ్ తరలింపునకు నిరసనగా టీడీపీ తలపెట్టిన రాష్ట్ర బంద్ తుస్సుమంది. ఇది జన జీవనంపై ఏమాత్రం చూపలేకపోయింది. సోమవారం ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర ప్రైవేటు వాహనాలు యధావిధిగా తిరిగాయి. దుకాణాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తెరుచుకున్నాయి. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గం కేంద్రంలో వ్యాపారులు స్వచ్ఛంద బంద్‌కు ముందుకు రాకపోవడంతో కొంత మంది టీడీపీ కార్యకర్తలు రోడ్డు మీదకు వచ్చి పెట్రోల్ బంకులు, హోటళ్లు, స్కూళ్లు, షాపులను బలవంతంగా మూయించారు. అయినప్పటికీ కాసేపటి తర్వాత తెరిచి వ్యాపారాలు కొనసాగించారు. టౌన్ సీఐ గణేష్, ఎస్సై సుధాకర్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రోలుగుంటలో ఆ పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు షాపులు తెరిచి ఆ తర్వాత మూసి మమ అనిపించారు. గొలుగొండ మండలంలో ఉదయం 9 గంటలకే షాపులు తెరిచి వ్యాపారాలు నిర్వహించారు. రావికమతం మండలంలో వ్యాపారులు సహకరించాలని టీడీపీ శ్రేణులు కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. రావికమతం హైస్కూల్ మినీ గేట్ మూసి నినాదాలు చేశారు. కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. చోడవరం పట్టణంలో రోడ్లన్నీ యధావిధిగా జనంతో రద్దీగా ఉన్నాయి. కె.కోటపాడు, మాడుగులలో యధావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి. దేవరాపల్లి, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాల్లో బంద్ ప్రభావం కానరాలేదు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని మొబైల్ ఐటీసీ కౌన్సిలర్ అర్జున్ కోరారు. అచ్యుతాపురం మండలం మార్టూరు, మడుతూరు గ్రామాల్లో సోమవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అలాగే గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 43 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎల్‌టీ కిషోర్, లింక్ వర్కర్ బి.సత్యనారాయణ, సర్పంచ్ రమేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం



దిమిలిలో వినాయక ఉత్సవాల రాట కార్యక్రమం

రాంబిల్లి : దిమిలిలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల రాట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు కె.టి. దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 18 న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దీక్షితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.